# సాక్షి జగిత్యాల

సోమవారం। 14। జూలై। 2025






**చూడచక్కని చెక్కపల్లి**

పర్యావరణ పరిరక్షణలో ఆ పల్లె ముందుంది. గ్రామస్తులు అంతా ఏకతాటిపైకి వచ్చి ప్లాస్టిక్‌ను నిషేధించాలని ప్రతిన బూనారు. -8లో▸



**మేధస్సుకు పదును చదరంగం**

చిన్నారుల మేధస్సుకు చదరంగం పదును పెడుతుందని కరీంనగర్ అడిషనల్ డీసీపీ వెంకటరమణ అన్నారు. మూడో ఆలిండియా చెస్ పోటీలు ముగిశాయి. -8లో▸

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం 33.0/26.0

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఎండవేడిమి పెరుగుతుంది. కొన్ని చోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### మారుమోగిన నృసింహుడి నామస్మరణ



స్వామివార్లను దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయం నారసింహ నామస్మరణతో మారుమోగింది. ఆదివారం సెలవు దినం సందర్భంగా భక్తుల రద్దీ పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. ముందుగా గోదావరిలో పవిత్ర స్నానాలు ఆచరించారు.

### దాడి సరికాదు

కథలాపూర్: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కార్యాలయంపై జాగృతి నాయకులు దాడి చేయడం దారుణమని మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడు చెదలు సత్యనారాయణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడారు. జాగృతి అధ్యక్షురాలు కవిత బీసీ ఉద్యమాన్ని అడ్డుపెట్టుకుని బీసీలకు అన్యాయం చేయాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఓసీ కుటుంబానికి చెందిన కవిత బీసీల ఉద్యమంలో పాల్గొనడంలో అర్థం లేదన్నారు. రాష్ట్రంలో అధిక జనాభా ఉన్న బీసీలు ఏకమైతే రాజకీయంగా దెబ్బతింటామనే భావనలో కవిత ఉన్నారన్నారు. ప్రజాస్వామ్య దేశంలో భావ ప్రకటన స్వేచ్ఛ ప్రతి ఒక్కరి సొంతమని, మల్లన్న కార్యాలయంపై దాడులకు పాల్పడటం జాగృతి నాయకులకు తగదన్నారు.

### 'కోట'కు నివాళి



ఇబ్రహీంపట్నం: పద్మశ్రీ అవార్డు గ్రహీత విలక్షణ నటుడు మాజీ ఎమ్మెల్యే కోట శ్రీనివాస్‌రావు మృతి చెందడంతో ఆదివారం మండలంలోని వేములకుర్తిలో సినీ ఆర్టిస్టులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సినీ ఆర్టిస్టులు భరత్‌కుమార్, రమేశ్, ప్రభాకర్, ఇంద్రయ్య, సురేందర్, రాజేశ్, కైలాశ్ పాల్గొన్నారు.

### దేశ ప్రజలకు అంబేడ్కర్ ఆరాధ్యనీయుడు



అంబేడ్కర్‌కు నివాళి అర్పిస్తున్న సంజీవరాజు

జగిత్యాలటౌన్: ప్రజలందరూ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో జీవించడానికి కారణమైన అంబేడ్కర్ దేశ ప్రజలందరికీ ఆరాధ్యనీయుడయ్యారని ద్యావర సంజీవరాజు అన్నారు. ప్రతీ ఆదివారం అంబేడ్కర్ స్మరణలో భాగంగా ప్రబుద్ధ భారత్ ఇంటర్నేషనల్ ఫౌండేషన్ (డిక్కీ)ఆధ్వర్యంలో జగిత్యాల తహసీల్ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్‌ను ప్రతినిత్యం స్మరించుకోవడం మనందరికి దక్కిన గొప్ప అదృష్టమన్నారు. ప్రజలందరికి సమాన హక్కులు కల్పించిన రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాలు, రాజ్యాంగాన్ని సైతం కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కేవలం ఆదివారమే కాదు ప్రతి రోజు అంబేడ్కర్‌ను స్మరించుకోవాలన్నారు. కార్యక్రమంలో డిక్కీ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్యాం, రవీందర్ రావు, అనంతుల కాంతారావు, పులి నర్సయ్య, మద్దెల నారాయణ,పల్లె రవి, అంబేడ్కర్ సంఘం నాయకులు పాల్గొన్నారు.

### నేడు వైస్ చాన్స్‌లర్ రాక

జగిత్యాలఅగ్రికల్చర్: మండలంలోని పొలాస వ్యవసాయ కళాశాలకు సోమవారం వ్యవసాయ వర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ అల్దాస్ జానయ్య రానున్నారు. కోరుట్లలో వ్యవసాయ విద్య విద్యార్థులను పొలాస వ్యవసాయ కళాశాలకు బదిలీ కార్యక్రమంలో పాల్గొననున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణి, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, వ్యవసాయ వర్సిటీ డీన్ ఆఫ్ అగ్రికల్చర్ డాక్టర్ కె.ఝన్సీరాణి, వ్యవసాయ వర్సిటీ డీన్ ఆఫ్ స్టూడెంట్ అఫైర్ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొననున్నారు.

# నాణ్యత డొల్ల.. ఆరోగ్యం డీలా..!

- హోటళ్లలో తాండవిస్తున్న అపరిశుభ్రత
- ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న యజమానులు
- ప్రజారోగ్యాన్ని పట్టించుకోని అధికారులు
- ప్రజలకు నాసిరకం ఆహారం తినిపిస్తున్న నిర్వాహకులు



రోడ్లపైనే ఏర్పాటు చేసిన ఆహార పదార్థాలు

కాగిన నల్లని నూనెలో వేయిస్తున్న మిరపకాయ బజ్జీలు

జగిత్యాల: జిల్లాలోని పలు హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రెస్టారెంట్లలో అపరిశుభ్రత తాండవిస్తోంది. మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాగిన నూనెలోనే మళ్లీమళ్లీ ఆహార పదార్థాలను తయారు చేస్తూ విక్రయిస్తున్నారు. మున్సిపల్ అధికారులు ఎప్పుడో సారి మొక్కుబడిగా తనిఖీ చేయడంతో నిర్వాహకుల ఇష్టారాజ్యంగా మారింది. గ్లాసులు కడిగిన నీటిలోనే మళ్లీ కడగడం, టిఫిన్ ప్లేట్లను కూడా అదే నీటిలో కడగడం చేస్తున్నారు. కనీసం వంట గదులైనా శుభ్రంగా ఉండడం లేదు. అపరిశుభ్ర వాతావరణంలో చేసిన ఆహార పదార్థాలనే ప్రజలకు అంటగడుతున్నారు.

**అసలే వానాకాలం.. ఆపై సీజనల్ వ్యాధులు**

జిల్లాలో సుమారు 500 హోటళ్లు, టిఫిన్ సెంటర్లు ఉన్నాయి. వివిధ అవసరాల కోసం పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు హోటళ్లలోనే తింటుంటారు. అల్పాహారం, భోజనం కోసం టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, రెస్టారెంట్లను ఆశ్రయిస్తారు. ఈనేపథ్యంలో హోటళ్ల నిర్వాహకులు పాత్రలను పైపైనే శుభ్రం చేస్తూ వినియోగదారులకు ఆహార పదార్థాలను వడ్డిస్తున్నారు. వంటగదుల్లో బొద్దింకలు, ఈగలు, బల్లులు స్వైర విహారం చేస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. వంట చేసే మాస్టర్లు, సర్వర్లు ఆప్రాన్స్, క్యాప్‌లు, గ్లౌస్‌లు ధరించాల్సి ఉంటుంది. కానీ, ఇవి మచ్చుకు కూడా కన్పించవు. భోజనం చేసే ప్రాంతంలో మాత్రం ప్రజలను ఆకట్టుకునేలా శుభ్రంగా ఏర్పాట్లు చేస్తారు. ప్రస్తుతం వానాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశముంది. మున్సిపల్ అధికారులు తనిఖీలు చేపట్టి హోటళ్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

**నాసిరకం ఆహార పదార్థాలు**

జిల్లా కేంద్రంలోని కొన్ని హోటళ్లు, టిఫిన్ సెంటర్లలో నకిలీ నూనె, నాసిరకం ఆహార పదార్థాలు వినియోగదారులకు వడ్డిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. వాస్తవానికి ఒకరోజు వినియోగించిన నూనె మరోరోజు వినియోగించకూడదు. కానీ.. కొన్ని హోటళ్లు కోళ్ల వ్యర్థాలు, జంతువుల కళేబరాలు, ఎముకల నుంచి తయారుచేసిన నూనెలు వాడుతున్నట్లు ఆరోపణలున్నాయి. భోజనం తయారుచేసే ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలి. వినియోగదారులు మిగిల్చిన ఆహారాన్ని వెంటనే పడేయాలి. ఆహార పదార్థాలు, మాంసం మిగిలితే నిల్వ చేయకూడదు. ఏరోజుకారోజు ఆహార పదార్థాలు వడ్డించాల్సి ఉండగా అసలు ఎక్కడా ఆ నిబంధన పాటించడం లేదు. అటు మున్సిపల్ అధికారులు, ఇటు ఆహార భద్రత అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో నిర్వాహకులు ఆడిందే ఆటగా మారింది. కొందరు నిర్వాహకులు నిబంధనలు గాలికొదిలేస్తూ ప్రజారోగ్యాన్ని పణంగా పెడుతున్నారు.

**తనిఖీలు చేస్తాం**



హోటళ్లలో పరిశుభ్రత పాటించాలి. నిబంధనలు పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం. భోజన ప్రియులకు నాణ్యమైన ఆహారం అందించాలి. ప్రతీరోజు తనిఖీలు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

– స్పందన, మున్సిపల్ కమిషనర్

# ఈ-పాస్ యంత్రాలకు కొత్త స్కానర్లు

- రేషన్ షాపుల్లో సులువుగా బియ్యం పంపిణీ



ఈ-పాస్ యంత్రాలకు కొత్త స్కానర్లు అమర్చే పనుల్లో టెక్నీషియన్లు, డీలర్లు

కథలాపూర్: రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీలో అవాంతరాలు తలెత్తకుండా ఉండాలనే ఉద్దేశంతో పంపిణీకి ఉపయోగించే ఈ-పాస్ యంత్రాల్లో స్కానర్ల మార్పిడికి సివిల్ సప్లయ్ అధికారులు చర్యలు చేపట్టారు. ఇప్పుడు రేషన్ డీలర్లు వినియోగిస్తున్న ఈ పాస్ యంత్రాలకు కొత్త స్కానర్లను అమర్చే ప్రక్రియ చేపడుతున్నారు.

**520 రేషన్ షాపులు**

జిల్లాలో ఐదు మున్సిపాలిటీలు ఉన్నాయి. అలాగే 385 గ్రామాలున్నాయి. పట్టణాలు, గ్రామాల్లో ఉంటున్నవారికి 520 రేషన్ షాపుల ద్వారా బియ్యం పంపిణీ చేస్తున్నారు. ప్రతినెలా రేషన్‌షాపుల నుంచి బియ్యం పంపిణీ చేస్తుండగా.. యంత్రాలు మొరాయించడం, టెక్నికల్ సమస్యలతో కొన్ని సందర్భాల్లో గంటలతరబడి లబ్ధిదారులు దుకాణాల్లో నిరీక్షిస్తున్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు ఉన్నతాధికారులు ఈ-పాస్ యంత్రాల్లో స్కానర్లను మార్చాలని నిర్ణయించారు. జూన్‌లో మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేయడంతో ఆగస్టు వరకు రేషన్ దుకాణాల్లో పంపిణీ ప్రక్రియ ఉండదు. ఈ వ్యవధిలో స్కానర్లను మార్చి కొత్త వాటిని అమరిస్తే పంపిణీకి మరింత సులువుగా ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు. ప్రతీ మండల కేంద్రానికి టెక్నీషియన్లను ఉన్నతాధికారులు పంపించి ఆయా గ్రామాల్లోని రేషన్‌డీలర్లు మండల కేంద్రాలకు యంత్రాలతో వచ్చేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ నెలఖారులోగా ఈ పాస్ యంత్రాల్లో కొత్త స్కానర్లు అమర్చాలనే లక్ష్యంతో ఉన్నట్లు జిల్లా సివిల్ సప్లయ్ అధికారి జితేందర్‌రెడ్డి తెలిపారు.

**తరచూ మొరాయిస్తుండటంతో కొత్త స్కానర్లు..**

రేషన్ డీలర్లకు సుమారు ఐదేళ్ల కిందట మంజూరు చేసిన ఈ-పాస్ యంత్రాలకు స్కానర్ల సమస్య తలెత్తిన విషయాన్ని సివిల్ సప్లయ్ అధికారులు గుర్తించారు. రేషన్ షాపుల్లో బియ్యం పంపిణీ చేసే సమయంలో వేలిముద్ర త్వరగా స్వీకరించకపోవడం, రెండు మూడు సార్లు వేలిముద్ర పెట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో పంపిణీలో జాప్యం జరుగుతోంది. స్కానర్ సక్రమంగా పనిచేయకపోవడంతో బ్లూటూత్ సమస్యలు తలెత్తాయి. ఏకంగా ఈ పాస్ యంత్రాల్లోని స్కానర్లను మార్చితే సమస్యలుండవని అధికారులు, టెక్నీషియన్లు భావించారు. ఈ పరిస్థితుల్లో మార్పు చేసిన యంత్రాలు త్వరగా వేలిముద్రలు స్వీకరిస్తున్నాయని అధికారులు అంటున్నారు. అయితే యంత్రాల్లో డిస్‌ప్లే, కీ ప్యాడ్ పనిచేయకపోవడం, బ్యాటరీ సమస్యలు కొన్ని రేషన్‌షాపుల్లో తలెత్తుతున్నాయని డీలర్లు వాపోతున్నారు. స్కానర్లతోపాటు ఇతర పరికరాలు మార్చాలని రేషన్ డీలర్లు కోరుతున్నారు.

**నెట్ లేకున్నా మిషన్ పనిచేయాలి**



ప్రభుత్వం రేషన్ షాపులకు అందించిన ఈ-పాస్ యంత్రాలు నెట్ సౌకర్యం ఉంటేనే పనిచేస్తాయి. ఇప్పటికి కొన్ని గ్రామాలకు సిగ్నల్, ఇంటర్నెట్ సౌకర్యం సరిగా లేదు. ఆ గ్రామాల్లో లబ్ధిదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేయాలంటే డీలర్లకు ఇబ్బందిగా ఉంది. నెట్ లేకున్నా రేషన్ సరుకులు లబ్ధిదారులకు అందించడానికి యంత్రాలు పనిచేసేలా కొత్త టెక్నాలజీ పరికరాలు రేషన్ డీలర్లకు అందించాలి.

– సింగారపు చిన్నయ్య, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర నాయకులు.

# జోరుగా తాకట్టు వ్యాపారం



పోలీసులు స్వాధీనం చేసుకున్న ప్రామిసరీ పేపర్లు (ఫైల్)

- నెలకు సుమారు రూ.15 కోట్ల వ్యాపారం
- 10 నుంచి 15 శాతం వడ్డీ వసూళ్లు
- తెల్లపేపర్లు, ఓపెన్ చెక్కులపై సంతకాలు

➡ జిల్లాకేంద్రంలోని పోచమ్మవాడకు చెందిన ఓ వ్యక్తి సాధారణ ప్రజలకు వాహనాలు, బంగారం, భూ డాక్యుమెంట్లు తాకట్టు పెట్టుకుని 10 నుంచి15 శాతం వడ్డీ వసూలు చేస్తున్నాడు. వడ్డీ తీసుకున్న వ్యక్తుల నుంచి ఓపెన్ చెక్కులు, తెల్లపేపర్లపై, వాహనాన్ని మార్పు చేసుకునేందుకు ఫారం 29, 30 మీద సంతకాలు తీసుకుంటున్నాడు. డబ్బు చెల్లించని వారిని వేధించడంతోపాటు, వారికి తెలియకుండానే వాహనాలను మార్పు చేసుకుంటున్నాడు.

➡ జిల్లా కేంద్రంలోని బైపాస్‌రోడ్‌లో ఓ వ్యక్తి ద్విచక్ర వాహనాలు, భూమి, కార్లు తాకట్టు పెట్టుకుని సుమారు రూ.2 కోట్ల మేర అప్పు ఇచ్చాడు. రూ.10 నుంచి రూ.15 వరకు వడ్డీ వసూలు చేస్తున్నాడు.




వడ్డీ వ్యాపారి ఇంట్లో సోదాలు చేస్తున్న పోలీసులు (ఫైల్)

జగిత్యాలక్రైం: జిల్లావ్యాప్తంగా వడ్డీ వ్యాపారం జోరుగా సాగుతోంది. వాహనాల యజమానులు రిజిస్ట్రేషన్ పత్రాలు తాకట్టు పెట్టి వడ్డీ వ్యాపారుల నుంచి అప్పు తీసుకుంటున్నారు. సమయానికి డబ్బులు అందక అప్పు చెల్లించడంలో జాప్యమైతే తాకట్టు పెట్టుకున్న వ్యక్తులు ఆ వాహనాలను అద్దెకిస్తూ సంపాదిస్తున్నారు.

**ఓపెన్ చెక్కులు.. తెల్లపేపర్ల సంతకాలు**

అధిక వడ్డీకి అప్పు ఇస్తున్న వ్యాపారులు తీసుకున్న వారినుంచి ఓపెన్ చెక్కులు, తెల్లపేపర్లపై సంతకాలు తీసుకుంటున్నారు. జాప్యం జరిగితే చెక్కులు, పేపర్లు చూపిస్తూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతున్నారు. వాహన పేపర్లు కూడా తాకట్టు పెడుతున్న సమయంలో వాహనం మార్పు కోసం రవాణాశాఖకు అవసరమైన 29, 30 ఫారంపై కూడా ముందే సంతకాలు తీసుకుంటున్నారు. కార్లు, ట్రాక్టర్లు, ఇతర వాహనాలు తాకట్టు పెట్టి అప్పు తీసుకున్న వారు బాకీ చెల్లించకుంటే వడ్డీ వ్యాపారులు ఆ వాహనాలను ఇతర ప్రాంతాల్లో అద్దెకిస్తూ నెలనెలా డబ్బులు సంపాదిస్తున్నారు.

**ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం**



వ్యాపారులు అధిక వడ్డీ వసూలు చేసినా, వాహనాలు, బంగారం, భూములు తాకట్టు పెట్టుకుని అప్పులు ఇవ్వడం చట్ట విరుద్ధం. అధిక వడ్డీ వసూలు చేసినా.. ఇబ్బందులకు గురిచేసినా.. డబ్బులు చెల్లించిన తర్వాత తిరిగి వాపస్ ఇవ్వకున్నా ఫిర్యాదు చేస్తే వ్యాపారులపై చర్యలు చేపడతాం.

– రఘుచందర్, జగిత్యాల డీఎస్పీ

# మల్చింగ్ సాగు బాగు

- కూలీల కొరతకు చెక్
- షీట్ల కోసం దరఖాస్తుల స్వీకరణ



అంతర్గాంలో మల్చింగ్ షీట్‌పై బీర సాగు



యశ్వంత్‌రావుపేటలో మల్చింగ్ షీట్‌పై సాగుచేస్తున్న మొక్కజొన్న పంట

జగిత్యాలఅగ్రికల్చర్: వర్షాలతో పంట చేలల్లో కలుపు మొక్కలు పెరిగి రైతులకు ఇబ్బందిగా తయారవుతాయి. కూలీలు దొరకకపోవడంతో.. పంటను మించి కలుపు మొక్కలు పెరిగి తీవ్ర నష్టం చేస్తున్నాయి. కొంతమంది రైతులు కలుపుతీయించినా లాభం లేదంటూ పంటనే వదిలేస్తున్నారు. ఈ నేపథ్యంలో కలుపు మొక్కలు రాకుండా మల్చింగ్ షీట్‌ను ఉపయోగిస్తున్నారు రైతులు.

**జిల్లాలో 1.50లక్షల ఎకరాల్లో ఆరుతడి పంటలు**

జిల్లాలో సుమారు 1.50 లక్షల ఎకరాల్లో ఆరుతడి పంటలు సాగవుతున్నాయి. ఇందులో ప్రధానంగా మొక్కజొన్న 43 వేల ఎకరాలు, పసుపు 35వేలు, కంది 5వేలు, పెసర మూడు వేలు, పత్తి 20వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఇటీవలి వర్షాలకు కలుపు మొక్కలు విపరీతంగా పెరిగాయి. వాటి నివారణకు గడ్డిమందులు పిచికారీ చేసినా వర్షాల కారణంగా పెద్దగా ప్రభావం చూపలేదు. దీంతో తుంగ, గరక వంటి కలుపు మొక్కలు ఎక్కువయ్యాయి. ఈ లోపే నాట్లు మొదలవడంతో కలుపు తీయాలా.. వద్దా అనే పరిస్థితుల్లో రైతులు ఉన్నారు.

**వేధిస్తున్న కూలీల కొరత**

పంటల్లో కలుపు తీయించేందుకు రైతులు కూలీల కోసం తిరుగుతున్నారు. రోజుకు రూ.300 నుంచి రూ.400 వరకు ఇస్తామన్నా.. కలుపుతీతకు రావడం లేదు. మొక్కజొన్న వంటి పంటలకు మొదటి దఫా రసాయన ఎరువులు వేయలేకపోతున్నారు.

**మల్చింగ్ షీట్‌ను ఉపయోగిస్తున్న రైతులు**

రెండేళ్లుగా వర్షాలు ఉండటం, కలుపు సమస్య పెరగడంతో కొంత మంది అభ్యుదయ రైతులు కలుపు మొక్కల నివారణకు మల్చింగ్ షీట్‌ను ఉపయోగిస్తున్నారు. కూలీలకు పెట్టే ఖర్చుతో మల్చింగ్ షీట్‌ను కొనుగోలు చేస్తున్నారు. సాగు భూమిని బోజెలుగా తయారు చేసి, వాటిపై మల్చింగ్ షీట్‌ను పరుస్తున్నారు. షీట్‌కు రంధ్రాలు చేసి వాటిలో మొక్కజొన్న, కంది వంటి విత్తనాలు నాటుతున్నారు. ఈ పద్ధతిని ఎక్కువగా కూరగాయల సాగుకు ఉపయోగించేవారు. ప్రస్తుతం కూలీల సమస్యతో విసిగిపోయిన రైతులు ఖర్చు ఎంతైనప్పటికీ మొక్కజొన్న, పసుపు వంటి పంటలకు కూడా ఉపయోగిస్తున్నారు.

**జిల్లాలో 312 ఎకరాల్లో సబ్సిడీపై మల్చింగ్ షీట్లు**

ఎంఐడీహెచ్ పథకం కింద మల్చింగ్ షీట్‌కు ఉద్యానశాఖ రాయితీలు అందిస్తోంది. ఎకరాకు రూ.8వేల వరకు సబ్సిడీ ఇస్తున్నారు. జిల్లాలో 312 ఎకరాల వరకు అర్హులైన రైతులకు మల్చింగ్ షీట్ ఇచ్చే అవకాశం ఉంది. ఆసక్తి గల రైతులు పట్టాదారు పాస్ పుస్తకం, అధార్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం జిరాక్స్‌లతో ఉద్యానశాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటే అధికారుల క్షేత్ర పరిశీలన చేసి రైతులకు సబ్సిడీ అందించనున్నారు.

**రైతులందరికీ మల్చింగ్ షీట్ ఇవ్వాలి**



మల్చింగ్ షీట్‌ను అడిగిన ప్రతి రైతుకు ఇవ్వాలి. సాధారణంగా కూరగాయల, పండ్ల తోటలతో పాటు ఆరుతడి పంటల్లో కలుపు మొక్కల సమస్య తీవ్రంగా ఉంటుంది. సబ్సిడీపై ఇస్తే చాలా మంది రైతులు ప్రతి పంటకు మల్చింగ్ షీట్ వేస్తారు.

– బండారి వెంకటేష్, పెంబట్ల, సారంగాపూర్

**దరఖాస్తు చేసుకోవచ్చు**



మల్చింగ్ షీట్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం. ఈ ఏడాది జిల్లాలో 312 ఎకరాల వరకు మల్చింగ్ షీట్‌ను సబ్సిడీపై ఇవ్వనున్నాం. మల్చింగ్ షీట్‌ను జాగ్రత్తగా వాడుకుంటే 3నుంచి4 పంటలకు వస్తుంది. కలుపు మొక్కలకు చెక్ పెట్టవచ్చు.

– శ్యాంప్రసాద్, జిల్లా ఉద్యానశాఖాధికారి

# తీన్మార్ మల్లన్నపై ఫిర్యాదు

- ఆడబిడ్డను అగౌరవిస్తే ఊరుకోం
- జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావవసంత



పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న బీఆర్‌ఎస్ మహిళా నాయకులు

జగిత్యాలరూరల్: ఆడబిడ్డలను అగౌరవపరిస్తే ఊరుకునేది లేదని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. ఎమ్మెల్సీ కవితపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆడబిడ్డను అవమానించడం సరికాదన్నారు. బీసీల కోసం పోరాటం చేస్తున్న కవితపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కవిత పోరాటాన్ని బీసీలు స్వాగతిస్తుంటే తీన్మార్ మల్లన్న చీము, నెత్తురు లేనట్లు మాట్లాడడం సరికాదని, వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు మారంపెల్లి రాణి, సాయి ఉదయ, బీఆర్‌ఎస్ నాయకులు అనురాధ, లక్ష్మి, రజియా, నజియా, భాగ్యలక్ష్మి, సునీత పాల్గొన్నారు.



రాయికల్: బోనాలతో పద్మశాలీ మహిళలు



ధర్మపురి: బోనాలతో మహిళలు

## ఘనంగా పోచమ్మ బోనాలు

రాయికల్/ధర్మపురి: రాయికల్, ధర్మపురిలో మహిళలు పోశమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించారు. రాయికల్‌లో పద్మశాలీ యువజన సంఘం ఆధ్వర్యంలో శోభాయాత్రగా ఆలయం వరకు వెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. సంఘం అధ్యక్షుడు సామల్ల సతీశ్, ప్రధాన కార్యదర్శి ఆడెపు రాజు, ఉపాధ్యక్షులు ఎలిగేటి సతీశ్, సింగని సతీశ్, కోశాధికారి నవీన్ పాల్గొన్నారు. ధర్మపురిలో దుర్గమ్మకాలనీ మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఆర్యవైశ్య సంఘం మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించారు.



ధర్మపురి: బోనాలతో దుర్గమ్మకాలనీ మహిళలు

## క్లుప్తంగా

### సింగరేణి కాంట్రాక్టు కార్మికుడి ఆత్మహత్య


మల్లికార్జున్ గౌడ్(ఫైల్)

జ్యోతినగర్(రామగుండం): ఎన్టీపీసీ పోలీస్ స్టేషన్ పరిధి మేడిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి సింగరేణి కాంట్రాక్టు కార్మికుడు సింగం మల్లికార్జున్‌గౌడ్ (40) పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు, ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం ప్రకారం .. మల్లికార్జున్‌గౌడ్ ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో కుటుంబలో తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఆదివారం కూడా గొడవ జరగడంతో మనస్తాపం చెందిన మల్లికార్జున్‌గౌడ్ గడ్డి మందు తాగాడు. కుటుంబసభ్యులు స్థానిక ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య మంగ, కుమార్తెలు హర్షిణి, హసిని ఉన్నారు. మృతుడి సోదరుడు రాజబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

### చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



హైదరాబాద్ ఆస్పత్రిలో మృతుని కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి అడ్లూరి

ధర్మపురి: మండలంలోని నాగారం గ్రామానికి చెందిన పసుల అరుణ్ నెల క్రితం రోడ్డు ప్రమాదానికి గురై హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించి ఆదివారం మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆస్పత్రికి వెళ్లి మృతుని కుటుంబసభ్యులను ఓదార్చారు. సొంత ఖర్చులతో అంబులెన్స్ ఏర్పాటు చేసి.. దహన సంస్కారాల కోసం రూ.10వేలు అందించారు.

### కుక్కల దాడిలో ముగ్గురు చిన్నారులకు గాయాలు

మెట్‌పల్లి: పట్టణంలో కుక్కల బెడద ప్రజలను ఆందోళనకు గురి చేస్తున్నాయి. స్థానిక దుబ్బవాడలో శుక్రవారం కుక్కల దాడిలో తొమ్మిది మంది గాయపడిన సంగతి తెలిసిందే. తాజాగా ఆదివారం దుబ్బవాడలో ఇద్దరు బాలురు నడుచుకుంటూ వెళ్తుండగా.. పాత బస్టాండ్ వద్ద ఒక బాలిక కుటుంబ సభ్యులతో కలిసి ఉండగా కుక్కలు దాడికి పాల్పడ్డాయి. గాయపడిన వీరిని ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

### యువకుడి గల్లంతు

గంగాధర: గంగాధర మండలం కొండన్నపల్లె శివారులోని వరద కాలువలో ఆదివారం సాయంత్రం చేపల వేటకు వెళ్లిన వ్యక్తి గల్లంతయ్యాడు. స్థానికుల వివరాల ప్రకారం.. రామడుగు మండలానికి చెందిన ఎనిమిది మంది కొండన్నపల్లె శివారులోని వరద కాలువలో చేపల వేటకు వచ్చారు. ఇర్ఫాన్ (30) అనే యువకుడు ప్రమాదవశాత్తు వరద కాలవలో పడి గల్లంతయ్యాడు. గంగాధర్ ఎస్సై వంశీకృష్ణ రాత్రి వరకు రెస్క్యూటీంతో గాలించినా ఆచూకీ లభించలేదు.

# చూడచక్కని చెక్కపల్లి



పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్టీల్‌బ్యాంకు

వేములవాడరూరల్: పర్యావరణ పరిరక్షణలో ఆ పల్లె ముందుంది. గ్రామస్తులు అంతా ఏకతాటిపైకి వచ్చి ప్లాస్టిక్‌ను నిషేధించాలని ప్రతిన బూనారు. అనుకున్నదే తడవుగా గ్రామంలో ఏ ఫంక్షన్ జరిగినా పేపర్ ప్లేట్లు, ప్లాస్టిక్ గ్లాసలను వినియోగించడం లేదు. స్టీల్ ప్లేట్లు, స్టీల్ గ్లాసులు వాడుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు వేములవాడరూరల్ మండలం చెక్కపల్లి. గ్రామస్తులు పాటిస్తున్న పర్యావరణ పరిరక్షణ చర్యలపై ప్రత్యేక కథనం.

**ఓడీఎఫ్ ప్లస్‌లో ముందడుగు**

స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ క్యాంపెయిన్‌లో భాగంగా 2025 ఏప్రిల్ 2న కేంద్ర బృందం గ్రామాన్ని సందర్శించింది. ఈ గ్రామంలో ఇంకుడుగుంతలు, కంపోస్ట్‌షెడ్, స్కూళ్లలో టాయిలెట్స్, సామూహిక ఇంకుడుగుంతలు పరిశీలించారు. ఓడీఎఫ్ ప్లస్ బహిరంగ మలవిసర్జన రహితంగా ఘన, ద్రవ విసర్జన బయటకు కనిపించకుండ, రోడ్డుపై చెత్త వేయకుండా, ఇంకుడుగుంతలతో నీరు బయటకు రాకుండా చేయడంతో ఓడీఎఫ్ ప్లస్‌గా గ్రామాన్ని ఎంపిక చేశారు. చెక్కపల్లిలో 464 గృహాలు ఉండగా 2,320 జనాభా ఉన్నారు. చెత్తను సేంద్రీయ ఎరువుగా తయారు చేసి ఆ గ్రామంలోనే రైతులకు విక్రయించడం ఇప్పటి వరకు గ్రామపంచాయతీకి రూ.6,625 ఆదాయం వచ్చింది. గ్రామంలో ఎవరి ఇంటిలో అయినా శుభకార్యాలు జరిగినప్పుడు పూర్తిగా ప్లాస్టిక్ వస్తువులు వాడకుండా గ్రామస్తులు తీసుకున్న నిర్ణయాలతో యజమాని స్టీల్ వస్తువులను వాడేలా గ్రామపంచాయతీ ఉచితంగా ఇచ్చేందుకు స్టీల్ బ్యాంకును ఏర్పాటు చేశారు. ప్లాస్టిక్ నివారణకు ప్రత్యేకంగా ఒక కమిటీని ఏర్పాటు చేసి కమిటీ ద్వారా గ్రామంలో ఎప్పటికప్పుడు నివారణ చర్యలు చేపడుతున్నారు. ప్రతీ ఇంటితోపాటు గ్రామంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలైన ప్రైమరీ, హైస్కూళ్లలో కూడా ఈ విధానం ఉండాలని గ్రామస్తులందరూ, కమిటీ సభ్యులు ఇంకుడుగుంతలు నిర్మించారు. గ్రామంలో డ్రెయినేజీ అనేది లేకుండా ప్రతి ఒక్కరు ఇంటివద్ద ఇంకుడుగుంతలనే ఏర్పాటు చేసుకున్నారు. దుకాణాల్లో ప్లాస్టిక్ వాడకుండా పేపర్, క్లాత్ బ్యాగుల అమ్మకాలు కూడా ప్రారంభించారు.


చెక్కపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం

**ఉత్తమ గ్రామపంచాయతీగా మూడుసార్లు అవార్డు**

రాజన్నసిరిసిల్ల జిల్లాలోనే వేములవాడరూరల్ మండలం చెక్కపల్లిని ఉత్తమ గ్రామపంచాయతీగా 2020, 2021, 2023 సంవత్సరంలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జిల్లాలో ఉన్న అన్ని గ్రామపంచాయతీలను పరిశీలించిన జిల్లా అధికారులు ఉత్తమ గ్రామపంచాయతీగా ఎంపిక చేస్తారు. అందులో చెక్కపల్లి గ్రామాన్ని ఆదర్శంగా తీసుకున్న జిల్లా యంత్రాంగం ఈ గ్రామాన్ని ఉత్తమ జీపీగా ఎంపిక చేశారు.

**అందరి సహకారంతోనే**



చెక్కపల్లి గ్రామం ఓడీఎఫ్ ప్లస్‌లో ముందుంజలో ఉండి ఉత్తమ గ్రామపంచాయతీగా మూడుసార్లు అవార్డు అందుకోవడంలో గ్రామస్తుల సహకారం ఉంది. గ్రామంలో ప్రతి ఒక్కరి కృషితోనే స్వచ్ఛభారత్, హరితహారం, ఇంకుడుగుంతలు అందరి సహకారంతోనే విజయవంతమై ఆదర్శంగా నిలిచింది.

– గడ్డం చందన, పంచాయతీ కార్యదర్శి, చెక్కపల్లి


స్వచ్ఛభారత్‌పై వార్డుల్లో అవగాహన కల్పిస్తున్న మహిళా కమిటీ సభ్యులు (ఫైల్)


ఇంటి ముందు ఏర్పాటు చేసిన ఇంకుడుగుంత


ఉత్తమ సర్పంచ్‌గా అవార్డు అందుకుంటున్న అర్జిక జైపాల్‌రెడ్డి (ఫైల్)

# మరుపురాని 'కోట' జ్ఞాపకం

- మధ్యంతర ఎన్నికలలో సాగర్‌జీతో కోట శ్రీనివాస్‌రావు ప్రచారం

చందుర్తి(వేములవాడ): ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ఉద్యమం జరుగుతున్న సమయం. 2009లో వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు గెలువగా, 2010లో పదవికి రాజీనామా చేశారు. దీంతో మధ్యంతర ఎన్నికలు అనివార్యమయ్యాయి. ఈ ఎన్నికల్లో బీజేపీ తరపున కేంద్ర మాజీ హోంశాఖ సహాయమంత్రి చెన్నమనేని సాగర్‌రావు వేములవాడ అసెంబ్లీ స్థానంలో ఎమ్మెల్యేగా పోటీచేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చెన్నమనేని సాగర్‌రావు తరపున సినీనటుడు కోట శ్రీనివాస్‌రావు 2010లో రుద్రంగిలో ప్రచారానికి వచ్చారు. కోట శ్రీనివాస్‌రావు మరణవార్త విన్న రుద్రంగివాసులు, బీజేపీ శ్రేణులు ఆనాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటున్నారు. బీజేపీ నాయకుడు పడాల గణేశ్ ఆధ్వర్యంలో కోట శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో కోటకు నివాళి అర్పించారు.


ఉమ్మడి చందుర్తి మండలం రుద్రంగిలో మధ్యంతర ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి చెన్నమనేని సాగర్ తరఫున ప్రచారానికి వచ్చిన సినీ నటుడు కోట శ్రీనివాస్‌రావు

## చేతకాకపోతే కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్‌కు అప్పగించండి

- మూడురోజుల్లో ప్రతీ ఎకరాకు సాగు నీరందిస్తాం
- అజ్ఞాని రేవంత్ పాలనలో తిరోగమనంలో రాష్ట్రం
- మాజీ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి ధ్వజం


మాట్లాడుతున్న మాజీమంత్రి జగదీశ్వర్‌రెడ్డి

గోదావరిఖని: 'మీకు చేతకాకపోతే.. మీకు నడపడం రాకపోతే.. కాళేశ్వరం ప్రాజెక్టును కేసీఆర్‌కు అప్పగిస్తే మూడురోజుల్లో ప్రతి ఎకరాకు సాగునీరందిస్తాం' అని మాజీమంత్రి జగదీశ్వర్‌రెడ్డి సవాల్ చేశారు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ నివాసంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ రంగానికి సాగునీరు ఇవ్వకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అన్నదాతలను గోస పెడుతోందన్నారు. ప్రస్తుతం సాగునీరు అందించేందుకు కాళేశ్వరం జోన్ పరిధిలోని ప్రాజెక్టులు సిద్ధంగా ఉన్నాయని, కావాలనే కాళేశ్వరం నీళ్లను రైతులకు ఇవ్వడం లేదని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో రాష్ట్రం అన్నిరంగాల్లో అభివృద్ధిలో ముందుకు సాగి సుభిక్షంగా ఉండేదని గుర్తుచేశారు. కమీషన్లు, కంపు మాటలు తప్ప 18 నెలల్లో జరిగిందేమీ లేదన్నారు. అజ్ఞాని ముఖ్యమంత్రిగా ఉండడంతో ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. రాష్ట్రాన్ని కేసీఆర్ సుభిక్షంగా ఉంచితే సీఎం రేవంత్‌రెడ్డి అప్పుల పాలు చేస్తున్నారని ఆరోపించారు. నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో మేల్కొల్పిందే కేసీఆర్ అని అన్నారు. కేసీఆర్ పాలనలో సుభిక్షంగా ఉన్న తెలంగాణను సీఎం రేవంత్‌రెడ్డి అప్పుల పాలు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుజోన్ పరిధిలో మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల, కన్నెపల్లి బ్యారేజీలకు ఎలాంటి ఇబ్బందులు లేవని, లక్షలాది ఎకరాలకు నీళ్లందించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఇప్పటికే రెండుపంటలు ఎండబెట్టారన్నారు. అన్నిరంగాలు వెనకపడి పోయాయన్నారు. నిరంతరం కరెంట్ ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఆదాయంలో రూ.15వేల కోట్లు తగ్గిందన్నారు. కేసీఆర్ పాలనలో ఏటా రూ.15వేల కోట్ల ఆదాయం పెరిగిందన్నారు. సమావేశంలో నాయకులు కౌశిక హరి, నడిపెల్లి మురళీధర్‌రావు, పీటీ స్వామి, పెంట రాజేశ్, బొడ్డు రవీందర్, మారుతి చిలకలపల్లి శ్రీనివాస్, అచ్చే వేణు, నూతి తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## నీట్ ర్యాంకర్లకు అభినందనలు


సింధును అభినందిస్తున్న అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి

కరీంనగర్: నీట్ యూజీలో జాతీయస్థాయి, రాష్ట్రస్థాయిలో 2వేల ర్యాంకు సాధించిన గుడికందుల సింధును ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వి.నరేందర్ రెడ్డి అభినందించారు. ప్రోత్సహించిన సింధు తండ్రి గుడికందుల సత్యంను శాలువాతో సన్మానించారు. సత్యం మాట్లాడుతూ పిల్లలు మరింత ఉన్నతస్థాయిలో ఎదగాలని, తన కూతురు పట్టుదలతో చదివి ర్యాంకులు సాధించినందుకు సంతోషంగా ఉందని తెలిపారు.

## కొదురుపాకలో గొర్రెలు చోరీ

బోయినపల్లి(చొప్పదండి): మండలంలోని కొదురుపాక ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో గొర్రెలు చోరీకి గురైనట్లు గొర్రెల కాపర్లు తెలిపారు. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన నలుగురు గొర్రెలకాపర్లు తమ గొర్రెలను శనివారం రాత్రి బీ సైడ్ కాలనీ శివారులో మంద పెట్టుకున్నారు. ఆదివారం తెల్లవారు జామున లేచి చూసేసరికి పెంజర్ల తిరుపతికి చెందిన 21 గొర్రెలు, పెంజర్ల అంజయ్యవి 10, పెంజర్ల ఎల్లయ్యవి 7, మల్యాల బాలయ్యవి 10 గొర్రెలను దొంగలు ఎత్తుకెళ్లినట్లు గుర్తించారు. రెండు గొర్రెలు సమీప ఆలయాల వద్ద గల మురుగుకాలువలో పడ్డట్లు గుర్తించారు. మరో గొర్రె గ్రామ సమీపంలో పడిపోగా, ఇంకో గొర్రె తప్పించుకొని మంద వద్దకు వచ్చినట్లు వివరించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.

## విలువలతో కూడిన విద్య సోషలిజంతోనే సాధ్యం



మాట్లాడుతున్న రమేశ్ పట్నాయక్

కరీంనగర్: సామాజిక స్పృహ, విలువలతో కూడిన విద్య కేవలం సోషలిజం ద్వారానే సాధ్యమని, నేటి విద్యార్థి, యువత సోషలిస్టు సమాజ నిర్మాణంలో క్రియాశీలక భాగస్వాములు కావాలని అఖిలభారత విద్యా పరిరక్షణ కమిటీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్‌పట్నాయక్ పిలుపునిచ్చారు. ఆదివారం జిల్లాకేంద్రంలో ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక శిక్షణ తరగతులు రెండోరోజు కొనసాగాయి. ×జాతీయత– దేశభక్తి¥ అనే అంశాన్ని విద్యా పరిరక్షణ కమిటీ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ పట్నాయక్ బోధించారు. మార్క్సిస్టు మహోపాధ్యాయుల– జీవిత చరిత్ర¥ అనే క్లాసును పీడీఎస్‌యూ రాష్ట్ర మాజీ నాయకులు కొత్తపల్లి రవి వివరించారు. 'నిర్మాణం- పని విధానం' అంశాన్ని పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర అధ్యక్షుడే ఆవుల అశోక్ బోధించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నరసింహారావు, నరేందర్, భాస్కర్, ఎర్ర అఖిల్ కుమార్, సహాయ కార్యదర్శులు సాయి, కర్క గణేశ్, సురేశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు రాలేదని కాంగ్రెస్ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

- రూ.50 వేలు డిమాండ్ చేశారంటూ ఆరోపణలు

తంగళ్లపల్లి(సిరిసిల్ల): మండలంలోని జిల్లెల్ల గ్రామంలో ఇందిర్మ ఇల్లు రాలేదని కాంగ్రెస్ పార్టీ కార్యకర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త ఎండీ భరస్ ఖాస్ గతంలో డబుల్ బెడ్‌రూం లబ్ధిదారుడిగా ఎంపికయ్యాడు. కాగా గ్రామంలో నిర్మించిన 26 డబుల్ బెడ్‌రూమ్‌లను శనివారం కలెక్టర్ పంపిణీ చేయగా అందులో భరస్‌ఖాన్ పేరు తొలగించారు. ఈ విషయంపై ఎంపీడీవో కార్యాలయానికి చేరుకుని కాంగ్రెస్ నాయకులను, అధికారులను నిలదీశాడు. అక్కడితో ఆగకుండా ఆదివారం జిల్లెల్ల కాంగ్రెస్ గ్రామాధ్యక్షుడిని ఇంటి కోసం రూ.50వేలు డిమాండ్ చేశావంటూ నిలదీశాడు. ఈ వీడియో స్థానికంగా వైరల్‌గా మారింది. తమ పార్టీ వారే మోసం చేశారని మనస్తాపానికి గురై పురుగులమందు డబ్బాతో చెరువు వద్దకు వెళ్లాడు. ఆత్మహత్య చేసుకోబుతున్నానంటూ స్నేహితులకు వీడియో కాల్ చేశాడు. వారు వెంటనే అతడి భార్య రుబీనాకు తెలపగా.. ఆమె చెరువు వద్దకు పరుగెత్తి పురుగుల మందు డబ్బాను లాగిపడేసింది. అతడిని బుజ్జగించి ఇంటికి తీసుకెళ్లింది. భరస్‌ఖాన్‌కు భార్య రుబీనా, ముగ్గురు కొడుకులు ఉన్నారు. తంగళ్లపల్లి పోలీసులు ఈ ఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.


భరస్‌ఖాన్ తీసుకెళ్తున్న అతని భార్య రుబీనా

# మేధస్సుకు పదును చదరంగం

- అడిషనల్ డీసీపీ వెంకటరమణ
- ముగిసిన 3వ ఆలిండియా జూనియర్, ఓపెన్ చెస్ టోర్నీ

కరీంనగర్‌స్పోర్ట్స్: చిన్నారుల మేధస్సుకు చదరంగం పదును పెడుతుందని కరీంనగర్ అడిషనల్ డీసీపీ వెంకటరమణ పేర్కొన్నారు. కరీంనగర్‌లోని వీకన్వెన్షన్‌లో జీనీయస్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో జరుగుతున్న 3వ ఆలిండియా జూనియర్, ఓపెన్‌చెస్ చాంపియన్‌షిప్– 2025 పోటీలు ఆదివారంతో ముగిశాయి. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి అడిషనల్ డీసీపీ వెంకటరమణ హాజరయ్యారు. విజేతలకు ట్రోఫీలు, నగదు పురస్కారం అందించారు. అనంతరం మాట్లాడుతూ.. జిల్లాకేంద్రంగా జాతీయ పోటీలు జరగడం అభినందనీయమన్నారు. చెస్‌తో చిన్నారుల్లో ఏకాగ్రత పెరుగుతుందన్నారు. తెలంగాణ ఒలింపిక్ సంఘం సంయుక్త కార్యదర్శి గసిరెడ్డి జనార్దన్ రెడ్డి మాట్లాడుతూ భారత చదరంగ క్రీడాకారులు నంబర్‌వన్ స్థానంలో నిలుస్తున్నారని తెలిపారు. జీనీయస్ చెస్ అకాడమీ డైరెక్టర్, కోచ్ కంకటి అనూప్‌కుమార్ మాట్లాడుతూ అందరి సహకారంతో జిల్లాలో 3వ ఆలిండియా పోటీలు ఘనంగా నిర్వహించినట్లు తెలిపారు. జీనీయస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకుడు కంకటి కనకయ్య, అర్బిటర్లు బొల్లం సంపత్, అమిత్, కంకటి సృజన్‌కుమార్, కె.సతీశ్‌బాబు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న అడిషనల్ డీసీపీ వెంకటరమణ, ఒలింపిక్ సంఘం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి జనార్దన్‌రెడ్డి



## 'విపంచి' పుస్తకావిష్కరణ

కరీంనగర్‌కల్చరల్: ఆరోగ్యకర, ఉత్తమ సమాజ నిర్మాణానికి విపంచి గేయ సంపుటిలోని పాటలు దోహదపడతాయని ప్రముఖ రచయిత కస్తూరి మురళీకృష్ణ అన్నారు. కవి నగునూరి రాజన్న వెలువరించిన 'విపంచి' గేయ సంపుటిని ఆదివారం భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించి మాట్లాడారు. పాటల రచనకు వయసుతో సంబంధం లేదని, కవి భావాల ప్రతిస్పందనలే కవితలు, పాటలుగా రూపొందుతాయన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న కవి, రచయిత, విమర్శకులు దాస్యం సేనాధిపతి మాట్లాడుతూ, విపంచి గేయ సంపుటిలో బాలగేయాలు, భక్తి గేయాలు, పర్యావరణ, చైతన్య, అభ్యుదయ, జానపద, లలిత గేయాలతోపాటు కార్మిక గేయాలు కూడా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కవులు వేములవాడ ద్రోణాచారి, బొమ్మకంటి కిషన్, అన్నాడి గజేందర్‌రెడ్డి, దామరకుంట శంకరయ్య, ఎలగొండ రవి, గూడెపు కుమార్, ఏడెల్లి రాములు, మేడి చంద్రయ్య, వెల్మల జయపాల్‌రెడ్డి, మానుపాటి రాజన్న, గుండు రమణయ్య, ఎస్.రాజయ్య తదితరులున్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కవులు

## జాతీయ రహదారిపై ప్రమాదం

- ఒకరు మృతి
- మరో ఇద్దరికి గాయాలు

మెట్‌పల్లి: పట్టణంలోని ఎస్సారెస్పీ కెనాల్ సమీపంలో జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం ప్రకారం.. బెజ్జారపు లక్ష్మీనరేందర్ (22), చీర్ల వంచ రఘువీర్ ఒకబైక్‌పై.. కత్రోజు సంతోష్ మరో బైక్‌పై ఎదురెదురుగా వస్తూ ఢీ కొన్నారు. ఈ సంఘటనలో ముగ్గురు కిందపడిపోయారు. అదే సమయంలో అటువైపు వేగంగా వస్తున్న ట్రాక్టర్ లక్ష్మీనరేందర్‌ను ఢీ కొట్టింది. దీంతో అతని తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. గాయపడిన మిగతా ఇద్దరిని మొదట స్థానిక ఆసుపత్రుల్లో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం ఇతర ప్రాంతాలకు తరలించారు. విషయం తెలుసుకున్న బాధితుల కుటుంబ సభ్యులు, బంధువులు పెద్ద సంఖ్యలో ఆసుపత్రులకు తరలివచ్చారు. లక్ష్మీనరేందర్ మృతదేహాన్ని చూసి కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోధించారు. సంఘటన స్థలాన్ని ఎస్సై కిరణ్‌కుమార్ పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.

## కత్తితో దాడి చేసిన వ్యక్తిపై కేసు

మల్యాల: నూకపల్లిలోగల డబుల్ బెడ్‌రూంఇళ్ల కాలనీలో షేక్ రెహాన్‌పై అదే కాలనీకి చెందిన షేక్ హంజా పాతకక్షలతో కత్తితో దాడి చేసి గాయపర్చగా.. కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. రెహాన్‌కు షేక్ హంజాకు పాత గొడవలున్నాయి. శనివారం రాత్రి రెహాన్ తన స్నేహితులపై కలిసి బైక్‌పై వెళ్తుండగా.. హంజా అడ్డగించి మెడపై కత్తితో దాడి చేశాడు. స్థానికులు బాధితుడిని జగిత్యాల ఆస్పత్రిలో చేర్చారు. రెహాన్ తల్లి రజియా బేగం ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

## కారు, బైక్ ఢీ.. యువకుడికి గాయాలు


కొడిమ్యాల: మండలంలోని చెప్యాల గ్రామంలో ఆదివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. చెప్యాలకు చెందిన ఊత్కూరి అభిజిత్ జగిత్యాల వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న షిఫ్ట్ కారు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో అభిజిత్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. వారు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ తెలిపారు.

# సర్కారు వైద్యం.. ప్రాణాలతో చెలగాటం

- జమ్మికుంట ఆస్పత్రిలో కాలం చెల్లిన మందులు
- మందులు వాడిన గర్భిణికి దద్దుర్లు, కడుపునొప్పి
- ప్రశ్నిస్తే దురుసుగా సమాధానం ఇచ్చిన వైద్యులు


గర్భిణి ముఖంపై దద్దుర్లు


గర్భిణికి అందించిన కాలం చెల్లిన మందులు



పరీక్షలు చేసిన రశీదు

జమ్మికుంట: సర్కారు ఆస్పత్రిలో వైద్యం సామాన్యుల ప్రాణాలమీదకు తెస్తోంది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందుతోందని, సద్వినియోగం చేసుకోవాలని పాలకులు, అధికారులు ఓ పక్క ప్రచారం చేస్తుండగా.. క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యం, వైద్యుల పర్యవేక్షణ లేనితనం శాపంగా మారుతోంది. జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రిలో గడువు ముగిసిన మందులు ఇవ్వగా.. సిబ్బంది నిర్లక్ష్యం ఓ గర్భిణి ప్రాణాల మీదకు తెచ్చింది. బాధితుల వివరాల ప్రకారం.. జమ్మికుంట పట్టణంలోని గణేశ్‌నగర్ చెందిన హరీశ్– కావ్య దంపతులు హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగులు. కావ్య ప్రస్తుతం ఐదునెలల గర్భిణి. ఏఎన్‌ఎం సూచనల మేరకు ప్రతీనెల జమ్మికుంట ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. ఈ నెల 10వ తేదీన నెల వారీ పరీక్షలకు ఆస్పత్రికి వచ్చింది. వైద్యురాలు ప్రణీత మల్టీ విటమిన్, ఐరన్ ట్యాబ్లెట్లు రాశారు. ఆస్పత్రి ఫార్మసీలో మందులు తీసుకుని వాడుతోంది. శనివారం అర్ధరాత్రి ఒక్కసారిగా కావ్య ముఖంపై దద్దుర్లు వచ్చాయి. కడుపునొప్పితో ఇబ్బంది పడింది. ఆదివారం ఉదయం మల్టీ విటమిన్ మందులను పరిశీలించగా జూన్ 2025న గడువు ముగిసినట్లు గుర్తించారు. ఆస్పత్రిలో సంప్రదించగా.. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో, విధుల్లో ఉన్న నర్సు సూపరిటెండెంట్‌తో ఫోన్లో మాట్లాడించారు. సదరు అధికారి 'అక్కడ మందులు ఇచ్చి, వేరే మందులు తీసుకెళ్లండి' అంటూ దబాయించాడు. దీంతో బాధితులు డయల్ 100కు సమాచారం ఇచ్చారు. పోలీసులు మొదలు వేరే ఆస్పత్రిలో చికిత్స పొందాలని సూచించడంతో వెళ్లిపోయారు. కాగా.. ఈ విషయమై సూపరింటెండెంట్ శ్రీకాంత్‌రెడ్డిని 'సాక్షి' వివరణ కోరగా.. ఫార్మసిస్టుపై విచారణ జరిపి, చర్యలు తీసుకుంటామని సమాధానం ఇచ్చారు.